నమస్తే తెలంగాణ
# హనుమకొండ
5 | వరంగల్, శనివారం 14 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA

## అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

- పార్టీ కార్యకర్తలు, ప్రజలను కలువనివ్వరా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, సెప్టెంబర్ 13 : హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, నాయకులు, కార్యకర్తలను పోలీసులు సుమారు ఐదు గంటల పాటు నిర్బంధించారు. హైదరాబాద్‌కు తరలి వెళ్తారని కార్యాలయం గేటును మూసివేశారు. పార్టీ ఆఫీసుకు వచ్చే వారి ఎందుకు వస్తున్నారు, పేర్లు తదితర వివరాలు తెలుసుకొని పంపారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తోపులాట జరుగడంతో కొంత ఉద్రిక్తత చోటుచేసుకొంది. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి, మాజీ మంత్రుల అరెస్టులు, నిర్బంధాలు, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై వినయ్‌భాస్కర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని అన్నారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలను కలవనివ్వరా అని పోలీసులను ప్రశ్నించారు. పార్టీ ఆఫీస్ గేట్లను ఎందుకు మూసివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమని అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు పోలీసులకు, పార్టీ శ్రేణులకు వాగ్వాదం జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కార్యాలయంలోనే నిర్బంధించడంతో భగ్గుమన్నారు.



హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద పోలీస్ బందోబస్తు

అడుగడుగునా నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ నేతలపై సర్కారు ఉక్కుపాదం మోపింది. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి ఘటన, మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టు నేపథ్యంలో పార్టీ పిలుపు మేరకు నిరసన తెలిపేందుకు హైదరాబాద్ వెళ్లకుండా గురువారం అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం కొనసాగింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకులు, శ్రేణులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేయగా వారు ఠాణాల్లో నిరసన తెలిపారు. ఇటు సర్కారు.. పోలీసుల తీరుపై భగ్గుమన్న బీఆర్ఎస్ నేతలు.. 'సీఎం రేవంత్ డౌన్ డౌన్'.. 'కాంగ్రెస్ గూండా రాజకీయం నశించాలి'.. 'నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో పోరాటాన్ని అడ్డుకోలేరంటూ అంతటా నినాదాలతో హోరెత్తించారు. అలాగే హరీశ్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. హనుమకొండలో పార్టీ కార్యాలయ గేట్లను సైతం మూసేసి జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, కార్యకర్తలను బయటకు రాకుండా పోలీసులు ఐదు గంటల పాటు నిర్బంధించారు. అలాగే ములుగులో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతిని హౌస్ అరెస్ట్ చేయగా ఇంట్లోనే బైఠాయించిన నిరసన తెలిపారు.

- నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 13



హనుమకొండ : బీఆర్ఎస్ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, నాయకులు, కార్యకర్తలు



## బీఆర్ఎస్ నేతలపై పోలీసుల ఉక్కుపాదం

- హైదరాబాద్ వెళ్లకుండా అర్ధరాత్రి నుంచే అరెస్టుల పర్వం
- ఎమ్మెల్యే కౌశిక్‌పై దాడి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అక్రమ అరెస్టులపై భగ్గుమన్న నేతలు
- అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరు
- కాంగ్రెస్ గూండా రాజకీయం నశించాలి
- ఠాణాల్లోనే నిరసన తెలిపిన శ్రేణులు
- సీఎం రేవంత్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- మానుకోటలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రాస్తారోకో
- హనుమకొండలో బీఆర్ఎస్ కార్యాలయ గేట్లు మూసేసిన పోలీసులు
- జిల్లా అధ్యక్షుడు దాస్యం బయటికి వెళ్లకుండా అడ్డగింత
- ములుగులో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హౌస్ అరెస్ట్



హనుమకొండ: మర్రి యాదవరెడ్డిని వాహనంలో తీసుకెళ్తున్న పోలీసులు



ములుగు: బీఆర్ఎస్ కార్యకర్తను తీసుకెళ్తున్న కానిస్టేబుల్

# అడుగడుగునా నిర్బంధం..



దంతాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మదర్ థెరిసా సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ కార్యకర్తలు

- ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి
- అక్రమ అరెస్టులను ఖండించాలి
- ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ధ్వజం

## కాంగ్రెస్‌ది గూండా రాజకీయం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 13 : ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గూండా రాజకీయాలు చేస్తున్నదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావును అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఎమ్మార్వో సెంటర్ నుంచి ర్యాలీగా మదర్ థెరిస్సా సెంటర్‌కు చేరుకొని రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఎం డౌన్ డౌన్.. కాంగ్రెస్ గూండాయిజం పోవాలి, బీఆర్ఎస్ నాయకులుపై పోలీసుల జులుం నశించాలి, ప్రజాస్వామిక విలువలను కాపాడాలి అంటూ పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెకపూడి గాంధీతో పాటు మరికొంత మంది కాంగ్రెస్ గూండాలతో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిని ముట్టడించి ఇంటిని ధ్వంసం చేయడం దారుణమని మండిపడ్డారు. భద్రత కల్పించాల్సిన పోలీసులే కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి మద్దతుగా పని చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో అరాచకం చేస్తున్నారని, దీనికి పోలీసులు మద్దతుగా నిలువడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్ట్ అంటే గౌరవం లేదని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించరా, నామినేషన్ వేయని వారికి చైర్మన్ పదవి ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు. అంతేగాక జిల్లాల్లో మండల, గ్రామస్థాయి బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పర్కాల శ్రీనివాస్ రెడ్డి, మార్నేని వెంకన్న, మంగళంపల్లి కన్న, జేరిపోతుల వెంకన్న, బానోత్ రవికుమార్ ఎడ్ల వేణుమాధవ్, నాయిని రంజిత్‌కుమార్, లునావత్ అశోక్‌నాయక్, తేళ్ల శ్రీను, షేక్ ఖాదర్ బాబా, సంతోష్, ఆవుల వెంకన్న, నీలేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

- పార్టీ మారిన ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

## అక్రమ అరెస్టులు సరికాదు

ములుగు, సెప్టెంబర్ 13(నమస్తేతెలంగాణ) : ప్రజాపాలనలో ప్రశ్నించడమే తప్పుగా పరిగణిస్తూ బీఆర్ఎస్ నాయకులను ఎక్కడికక్కడ పోలీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు చేయించడం సరైంది కాదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు జిల్లాకేంద్రంలోని తన ఇంటి నుంచి నాయకులతో కలిసి హైదరాబాద్‌కు బయల్దేరుతున్న ఆమెను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు ఆమె నివాసానికి చేరుకున్నారు. అరెస్టులను నిరసిస్తూ ప్లకార్డులను చేతపట్టుకొని పెద్ద ఎత్తున కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలు మారిన ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రోజుకో కొత్త డ్రామాకు తెరతీస్తూ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు మల్క రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, సానికొమ్ము రమేశ్‌రెడ్డి, పోరిక విజయ్‌రామ్‌నగర్, వేములపల్లి భిక్షపతి, దుర్గం రమణయ్య, బైకాని సాగర్, గొర్రె సమ్మయ్య, ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, గరిగె రఘు, అన్న తిరుపతి, స్వరూప ఉన్నారు.



ములుగులో హౌస్ అరెస్టును నిరసిస్తూ బైఠాయించి నినాదాలు చేస్తున్న నాగజ్యోతి, కార్యకర్తలు



## కరెన్సీ గణనాథుడు

- రూ.కోటిన్నరతో అలంకరణ..
- ధనలక్ష్మి పూజ

ఖిలావరంగల్, సెప్టెంబర్ 13 : వరంగల్ శివనగర్‌లో కరెన్సీ గణనాథుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. వినాయక ఉత్సవ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రూ.కోటిన్నర నగదుతో అలంకరించి ధనలక్ష్మి పూజ చేశారు. కరెన్సీ గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చి సెల్ఫీలు దిగారు.

శివనగర్‌లో కరెన్సీ అలంకరణలో గణనాథుడు

## క్షణాల్లో స్పందించి.. బతికించారు

- వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్యాయత్నం
- చనిపోతామంటూ సెల్ఫీ వీడియో
- ముగ్గురి లైఫ్‌ను సేవ్ చేసిన పోలీసులు

ఆర్థిక పరిస్థితి బాగాలేదని తాపీమేస్త్రీ.. భర్తతో గొడవనో లేక మరే కారణమో రెండేళ్ల కూతురితో ఓ వివాహిత రైలు పట్టాలపై, ప్రజలను భయపెట్టేలా దెయ్యం వీడియో పెట్టి దొరికిన భయంతో యువకుడు పురుగుల మందు తాగి సెల్ఫీ వీడియో తీసుకొని ఇక చనిపోతున్నామంటూ మృత్యువుకు ఎదురువెళ్లగా సకాలంలో స్పందించిన పోలీసులు ఆ ముగ్గురు ప్రాణాలు కాపాడారు. లొకేషన్ ద్వారా ఇద్దరిని, ఘటన స్థలంలోనే జరగబోయే ప్రమాదాన్ని గుర్తించి మరొకరి లైఫ్‌ను సేవ్ చేశారు. వరంగల్, ములుగు జిల్లాల్లో వేర్వేరు చోట్ల ఈ ఘటనలు జరుగగా సాంకేతికను అందిపుచ్చుకొని క్షణాల్లో అక్కడికి వాలిపోయిన పోలీసులను వారి కుటుంబసభ్యులు, ప్రజలు అభినందించారు.

- ములుగు, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ)/ ఖిలావరంగల్ /సంగెం

ములుగు, వరంగల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల శుక్రవారం ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే స్పందించి వారిని కాపాడారు. వివరాల్లోకి వెళితే ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం రాజన్నపేటకు చెందిన వాసం నాగరాజు ఇటీవల సోషల్ మీడియాలో తమ గ్రామంలో దెయ్యం తిరుగుతున్నదని వాట్సాప్ గ్రూప్‌లో వీడియో పోస్ట్ చేశాడు. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురికాగా, స్థానిక ఎస్సై గ్రామానికి చేరుకొని మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. అయితే వీడియో పోస్ట్ చేసింది నాగరాజుగా గుర్తించిన ఎస్సై అతడిని మందలించాడు. దీంతో అతడు ఎస్సైతో తనకు ప్రాణభయం ఉందని, తన చావుకు ఆయనే కారణమంటూ పురుగు మందు డబ్బాతో సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న సదరు ఎస్సై వెంటనే లొకేషన్ ఆధారంగా సిబ్బందితో వెళ్లి నాగరాజును రక్షించారు.

***రెండేళ్ల కూతురితో మహిళ..***

హనుమకొండకు చెందిన పీ మానస తన రెండేళ్ల కూతురితో ఆత్మహత్య చేసుకునేందుకు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి రైలు పట్టాలపై కాజీపేట వైపు నడుచుకుంటూ వెళుతున్నది. ఈ క్రమంలో ఆన్‌డ్యూటీ పెట్రోలింగ్ సిబ్బంది ఈ విషయమై సమాచారం ఇవ్వడంతో జీఆర్పీ సిబ్బంది కే విక్రం, కే ప్రశాంత్, సీహెచ్ సుమలత అక్కడకు చేరుకొని తల్లి, కూతురిని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో సోదరుడు క్రాంతికుమార్, భర్త ప్రవీణ్ రాగా, కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం వారికి అప్పగించారు.


***ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..***

ఎనుమాముల మార్కెట్ సమీపంలోని ఎంఎస్‌కాలనీలో నివాసం ఉంటున్న బండి రాజు తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో ఆత్మహత్య చేసుకునేందుకు సంగెం మండలం చింతలపల్లి రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. ఇంటికి ఫోన్ చేసి రైలు కింద పడి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు 100కు డయల్ చేసి లొకేషన్ చెప్పటంతో సంగెం ఎస్సై ఎల్ నరేశ్ తన సిబ్బందిని పంపించారు. ట్రాక్ మధ్యలో మద్యం మత్తులో పడుకొని ఉన్న రాజును కానిస్టేబుల్ సురేశ్ పక్కకు తీసుకొచ్చి కాపాడాడు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.



వరంగల్‌లో మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు





రాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు కానిస్టేబుల్






పురుగుల మందు డబ్బాతో ఉన్న నాగరాజును రక్షించి తీసుకెళ్తున్న పోలీసులు

## కల్యాణలక్ష్మి సాయం పక్కదారి?

- ఒకరి పేర మంజూరైన ఆర్థిక సహాయం మరొకరికి
- తాజాగా వరంగల్ జిల్లాలో వెలుగులోకి
- ఆర్డీవో ఆఫీసులోని ఓ ఉద్యోగి పాత్ర
- కొనసాగుతున్న విచారణ




పేదింటి ఆడబిడ్డ పెళ్లికి అండగా నిలిచే ఆర్థికంగా భరోసానిచ్చేందుకు గత కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మీ పథకాన్ని కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన దరఖాస్తుదారుల జాబితాలో ఇతరుల పేర్లు చేర్చి వారికి మంజూరైన ఆర్థిక సహాయాన్ని మరకొరి ఖాతాకు మళ్లిస్తున్నట్లు తెలిసింది. వరంగల్ జిల్లాలోని కొన్ని మండలాల్లో రెండేళ్లుగా ఈ తతంగం నడుస్తుండగా సాయం మంజూరైనా ఇంకా అందలేదని దరఖాస్తుదారులు ఉన్నతాధికారుల వద్దకు వెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాగా అప్పటికే అక్రమార్కులు చెక్కులను డ్రా చేసుకోగా ఈ వ్యవహారంపై విచారణ మొదలైంది. ఇందులో ఆర్డీవో ఆఫీసులోని ఓ ఉద్యోగి పాత్ర ఉన్నట్లు తేలగా, జిల్లాలో ఎన్ని మండలాల్లో, ఎప్పటినుంచి జరుగుతోంది? మొత్తం వచ్చిన దరఖాస్తులు, మంజూరైన వివరాల జాబితా, ఆర్డీవో ఆఫీస్ నుంచి బ్యాంకుకు పంపిన వివరాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

– వరంగల్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ)

జిల్లాలోని వివిధ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం పంపిణీ పక్కదారి పట్టినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి ఈ పథకాల ద్వారా కొందరు లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయాన్ని అక్రమార్కులు కాజేసినట్లు సమాచారం. వరంగల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం(ఆర్డీవో) కేంద్రంగా ఈ వ్యవహారం జరిగినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం అర్హులైన దరఖాస్తుదారులకు రూ.1,00,116 ఆర్థిక సహాయం అందజేస్తుంది. ఇందుకోసం ఆయా మండలంలోని అర్హులైన తల్లిదండ్రులు తమ కూతురికి వివాహం చేసిన తర్వాత కల్యాణలక్ష్మి పథకం నుంచి ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో తమ కూతురి పేర ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తారు. స్థానిక తహసీల్దార్ లాగిన్‌లోకి చేరే ఈ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలిస్తారు. వెరిఫికేషన్ అనంతరం దరఖాస్తుదారుల జాబితాను స్థానిక ఎమ్మెల్యేకు పంపిన తర్వాత సహాయం మంజూరు కోసం ఆర్డీవో కార్యాలయానికి చేరుతుంది. ఆమోదముద్ర పడగానే నిధుల విడుదల కోసం లబ్ధిదారుల పేర్లతో కూడిన లిస్ట్ ఎస్టీవో ఆఫీసుకు వెళ్తుంది. కులంవారీగా వెసులుబాటును బట్టి ఎస్టీవో కార్యాలయం నుంచి ఆర్డీవో పేర ఉన్న బ్యాంకు ఖాతాకు నిధుల విడుదల జరుగుతున్నట్లు తెలిసింది. ఈమేరకు నిధులు విడుదలైన కల్యాణలక్ష్మి లబ్ధిదారుల జాబితా ఎప్పటికప్పుడు ఎస్టీవో ఆఫీసు నుంచి ఆర్డీవో కార్యాలయానికి అందుతున్నట్లు సమాచారం. తీరా ఆర్డీవో ఆఫీసు నుంచి కల్యాణలక్ష్మి పథకం చెక్కుల తయారీ కోసం బ్యాంకుకు వెళ్లే అనెక్జర్‌లో పేర్లు మారుతున్నట్లు తెలిసింది. వరంగల్ ఆర్డీవో కార్యాలయం నుంచి స్థానిక ఆర్డీవో పేర కల్యాణలక్ష్మి అకౌంట్ గల బ్యాంకుకు చేరిన అనెక్జర్‌లో కొన్ని పేర్లు మారడం వల్ల ఆర్థిక సహాయం మంజూరైన దరఖాస్తుదారులకు కాకుండా ఇతరులకు అందినట్లు సమాచారం. రెండేళ్ల కాలంలో పర్వతగిరి, గీసుగొండ తదితర మండలాల్లో ఇలా జరిగినట్లు కొద్దిరోజుల క్రితం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ ఆర్డీవో కార్యాలయం నుంచి బ్యాంకుకు చేరిన అనెక్జర్‌లో అక్రమార్కులు ఆర్థిక సహాయం మంజూరైన దరఖాస్తుదారుల పేర్ల స్థానంలో ఇతరుల పేర్లు చేర్చడం వల్ల బ్యాంకర్లు ఈమేరకు చెక్కులను తయారు చేయడం, రూ.1,00,116తో కూడిన ఒక్కో చెక్కును అక్రమార్కులు డ్రా చేసుకున్నట్లు సమాచారం. ఆర్థిక సహాయం ఎదురుచూసిన దరఖాస్తుదారులు చివరకు తమకు కల్యాణలక్ష్మి పథకం నుంచి ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొద్దిరోజుల క్రితం ఈ వ్యవహారం బయటపడినట్లు తెలిసింది. దీంతో ఇలా ఎన్ని మండలాల్లో జరిగింది?, ఎంతమంది దరఖాస్తుదారులపేర మంజూరైన కల్యాణలక్ష్మి పథకం ఆర్థిక సహాయం పక్కదారి పట్టింది? అనే వివరాలను కొద్దిరోజుల నుంచి అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆయా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో ఆఫీసుకు అందిన కల్యాణలక్ష్మి దరఖాస్తులను, ఆర్థిక సహాయం మంజూరైన దరఖాస్తుదారుల జాబితాలు, ఆర్డీవో కార్యాలయం నుంచి బ్యాంకుకు పంపిన అనెక్జర్‌లను పరిశీలించే పనిలో అధికారులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు దరఖాస్తుదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి ఆర్థిక సహాయం ఇతరులకు అందినట్లు తాజా విచారణలో బయటపడినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఆర్డీవో కార్యాలయంలోని ఓ ఉద్యోగి పాత్ర ఉందని తేలినట్లు సమాచారం. కొన్ని మండలాల్లో షాదీ ముబారక్ ఆర్థిక సాయం ఇలాగే పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయమై డీఏవోను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని బదులివ్వడం గమనార్హం.